

శిక్షణ పూర్తిచేసుకున్న అంగన్‌వాడీ టీచర్లకు హ్యాండ్‌బుక్స్ అందజేస్తున్న ఎంపీపీ కృపేశ్, సీడీపీవో శాంతిశ్రీ

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో

అంగన్‌వాడీల పాత్ర కీలకం

ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 25 : చిన్నతనం నుంచే చిన్నారులకు ఉత్తమ బోధన చేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమైందని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అన్నారు. నూతన జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం పాఠ్యపుస్తకాల ప్రణాళికలో మార్పులు గుర్తించి ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ.. 0-8 సంవత్సరాల పిల్లల్లో చాలా వరకు మేధోవృద్ధి ఈ కాలంలోనే జరుగుతుందని తెలిపారు. వారికి కథలు, ఆటపాటల ద్వారా విద్య నేర్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లకు హ్యాండ్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, పల్లవి, సరళ, ప్రథమ్ ఎన్జీ మహేశ్వరి పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారి

చేవెళ్లటౌన్, జూన్ 25 : అర్హులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని చేవెళ్ల మండల పరిషత్తు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టైపిస్టు రాంచందర్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. గృహజ్యోతి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహజ్యోతికి సంబంధించి 90 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గతంలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రసీదులు తీసుకురావాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సాయి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది గౌస్, కృష్ణ ఉన్నారు.

కడ్తాల్‌లో నిరుపేద కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ

నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటా

జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, జూన్ 25 : కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటానని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కంబాలపల్లి జంగయ్య నెల రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద మరణించడంతో ఇల్లు గడవడం కూడా కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ మంగళవారం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి జడ్పీటీసీ మనోధైర్యాన్ని కల్పించి, రాధాకృష్ణ ట్రస్టు తరపున రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు నర్సింహ, లాయక్‌అలీ, కృష్ణ, అంజి, శ్రీను, వెంకటేశ్, మహేశ్, పాండు, సురేశ్, శ్రీకాంత్, రాజా, రాములు, శివ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని ఓ మహిళ చేవెళ్లలో తిరుగుతుండగా పెట్రోల్ మొబైల్ పోలీస్ సిబ్బంది డబ్ల్యూపీసీ మంజుల, జావీద్, అశోక్ గమనించారు. ఆమె పరిస్థితిని చూసి కొత్త దుస్తులు అందించారు. - చేవెళ్లటౌన్, జూన్ 25

నాటు సారా స్వాధీనం.. ఒకరు అరెస్ట్

ఎక్సైజ్ శాఖ అధికారుల అదుపులో నాటు సారా తరలిస్తున్న వ్యక్తి

కడ్తాల్, జూన్ 25 : ఆమనగల్లు సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చారకొండ గ్రామం నుంచి ఇర్విన్ వెళ్లే రహదారిలో ఎక్సైజ్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ బైక్‌పై తరలిస్తున్న ఆరు లీటర్ల నాటు సారా లభ్యమైంది. సారాను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే ఇదివరకు నాటు సారా తయారీ కేసుల్లో పట్టుబడిన 11 మందిని తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో ఇప్పటివరకు 110 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ వివరించారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

హెడ్ కానిస్టేబుల్ తిరుపతిని సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది

కడ్తాల్ (తలకొండపల్లి), జూన్ 25 : అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో నాలుగేండ్లుగా హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతి బదిలీలో భాగంగా కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈమేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఆధ్వర్యంలో ఆయనను పోలీస్ సిబ్బంది సన్మానించారు. తిరుపతి అందించిన సేవలను పలువురు కానిస్టేబుళ్లు కొనియాడారు.

టీఎస్ఎస్‌వో నూతన కార్యవర్గం

నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాన్ని అందజేస్తున్న టీఎస్ఎస్‌వో మండలాధ్యక్షుడు రేవంత్‌గౌడ్

కడ్తాల్, జూన్ 25 : మండల పరిధిలోని చరికొండ గ్రామంలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. టీఎస్ఎస్‌వో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మండలంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నామని మండలాధ్యక్షుడు రేవంత్‌గౌడ్ తెలిపారు. టీఎస్ఎస్‌వో గ్రామాధ్యక్షుడిగా రాహుల్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా భానుప్రసాద్, సహాయ కార్యదర్శిగా శేఖర్‌గౌడ్, కన్వీనర్‌గా నాగరాజు, కార్గవర్య సభ్యులుగా నరేందర్‌గౌడ్, శివ, సాయికిరణ్, అనిల్, సాయి, తరుణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై టీఎస్ఎస్‌వో పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులున్నారు.

షాబాద్ మండలం నాందార్‌ఖాన్‌పేట్‌లో ఓ కిరాణా దుకాణంలో మద్యం పట్టుకున్న పోలీసులు

మద్యం పట్టివేత

షాబాద్, జూన్ 25 : అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న కిరాణా దుకాణంపై పోలీసులు దాడులు నిర్వహించారు. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని నాందార్‌ఖాన్‌పేట్ గ్రామంలో గంగాపురం మల్లేశ్ తన కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం దుకాణంపై దాడులు నిర్వహించారు. దుకాణంలో 21 బీరు బాటిళ్లు లభించాయి. బీర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు దుకాణ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలినడకన పాఠశాలకు వస్తున్న మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన విద్యార్థినులు

కాలినడక కష్టాలు

- సకాలంలో బస్సులు రాక, కొరతతో నిత్యం అవస్థలు పడుతున్న విద్యార్థులు
- ప్రతి రోజూ కిలోమీటర్ల మేర నడుస్తూ నరకయాతన
- పట్టించుకోని అధికారులు

యాచారం మండల పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న నానక్‌నగర్, మల్కీజ్‌గూడ, కడ్తాల మండలం పల్లెచెల్క తండాకు చెందిన విద్యార్థులు నిత్యం కాలినడకతో పాఠశాలకు వెళ్తున్నారు. దీంతోపాటు కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు సైతం కాలినడక కష్టాలు తప్పడం లేదు. వీరంతా ప్రతిరోజూ కొన్ని కిలోమీటర్ల మేర నడిచి మేడిపల్లికి చేరుకొని చదువులు కొనసాగిస్తున్నారు. కుర్మిద్దతో పాటు గ్రామానికి అనుబంధంగా ఉన్న మర్లకుంట తండా, మంగలిగడ్డ తండాలకు చెందిన విద్యార్థులు కాలినడకన కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట పాఠశాలకు వెళ్లాల్సి వస్తున్నది. నందివనపర్తి పాఠశాలలో చదువుకోవడానికి వస్తున్న చౌదర్‌పల్లి, అయ్యవారిగూడం, బొల్లిగుట్ట తండా, పిల్లిపల్లి, కొమ్మోనిబావి విద్యార్థులు నడకయాతన పడాల్సిందే.. కొత్తపల్లి పాఠశాలలో చదువునభ్యసించడానికి తక్కళ్లపల్లి, కొత్తపల్లితండా విద్యార్థులు., తులేఖుర్దు పాఠశాలకు వస్తున్న ధర్మన్నగూడ, భాషమోనిగూడ గ్రామాలకు చెందిన విద్యార్థులు నిత్యం సకాలంలో బస్సులు లేకపోవడంతో కాలినడకతో ఇబ్బందులు పడుతున్నారు. పైగా సకాలంలో పాఠశాలకు చేరుకోకపోవడం, విలువైన పాఠాలను కోల్పోవడం, సాయంత్రం అలసిపోయి హోంవర్క్ చేసుకోలేకపోవడం, ఆరోగ్యం క్షీణించడం లాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో కొంతమంది తల్లిదండ్రులు బస్సు సౌకర్యంకోసం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. సకాలంలో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యాలు కల్పించి విద్యార్థుల కష్టాలు తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేసవి సెలవులను ముగించుకొని తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. సొంత ఊర్లో ఉన్నత పాఠశాలలు ఉన్న విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లడానికి ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ పక్క గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు మాత్రం నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యంగా తండాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు పడుతున్న కష్టాలు చెప్పనలవి కావు. బస్సుల కొరతతో అనుబంధ గ్రామాలు, తండాల విద్యార్థులకు కాలినడక కష్టాలు తప్పడంలేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో సకాలంలో సరిపడ బస్సులు లేక, కొరతతో కొన్ని కిలోమీటర్ల మేర కాలినడకన పాఠశాలలకు వెళ్లాల్సి రావడంతో అవస్థలు పడుతున్నారు.

- యాచారం, జూన్ 25

యువకుడు అదృశ్యం

ఆలకుంట్ల ఏలియా

షాబాద్, జూన్ 25 : ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన ఆలకుంట్ల ఏలియా మూడు నెలల క్రితం షాబాద్‌కు కేబుల్ వర్క్ చేయడానికి వచ్చాడు. ఏప్రిల్ 22న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. అతడి ఫోన్ 9701750779కి ఫోన్ చేస్తే రింగ్ అవుతున్నదని.. కాని లిఫ్ట్ చేయడంలేదు. దీంతో షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అతడి ఆచూకీ తెలిసినవారు షాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ సూచించారు.

భూదాన్‌లో నిర్మాణాలపై సీపీఎం ఫిర్యాదు

పెద్దఅంబర్‌పేట, జూన్ 25 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలోని భూదాన్ భూమితో సంబంధం లేనివారికి నిర్మాణాలకు అనుమతిచ్చినవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ రవీందర్‌దత్తుకు వినతిపత్రం అందజేశారు. తారామతిపేట గ్రామం భూదాన్ భూమి సర్వే నం.215, 216, 217లలో గ్రామ పంచాయతీకి ఎటువంటి సంబంధం లేని గ్రామ కార్యదర్శి, మాజీ సర్పంచ్ డబ్బులు తీసుకొని ఇంటి నిర్మాణం కోసం అనుమతి ఇచ్చారని వివరించారు. గ్రామ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని, మాజీ సర్పంచ్‌పై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూమిని అక్రమంగా కబ్జా చేయాలని చూస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జా నుంచి భూదాన్ భూమిని రక్షించి రైతుల సేద్యానికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు శివకుమార్, సాయికుమార్ ఉన్నారు.

సమన్వయంతో పనులు చేయాలి

క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూన్ 25 : అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో పూడికతీత పనులతోపాటు ఎలాంటి వరదనీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కొన్ని రోజుల క్రితమే జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ జియాఉద్దీన్‌తో సమావేశమై నియోజవకవర్గంలోని పలు సమస్యలను వివరించామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని అధికారులు అన్ని విభాగాల వారిని సమన్వయం చేసుకుని పనులు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా చూడాలని కోరారు. గతంలో నిర్మించిన ఎస్ఎన్‌డీపీ, బాక్స్ డ్రెయిన్‌లతో చాలా వరకు ముంపు సమస్యలు తీరాయని, అవి సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. నూతన డ్రెయిన్ల నిర్మాణాల్లో ఎత్తుపల్లాలు సరి చూసుకుని పనులు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు రమేశ్‌బాబు, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్

ఆమనగల్లు, జూన్ 25 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం విద్యా సంస్థల బంద్‌ను పాటిస్తున్నట్లు ఆమనగల్లు మండలం ఏబీవీపీ నగర కార్యదర్శి శివ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని.. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు విక్రయించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా సంస్థల బంద్‌కు పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

చిలుకూరులో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేసిన రాజుముదిరాజ్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాలి

జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజుముదిరాజ్

మొయినాబాద్, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాలని జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ గరుగు రాజుముదిరాజ్ అన్నారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జీఆర్ ఫౌండేషన్‌వారు గరుగు రాజన్న యువ సేన ఆధ్వర్యంలో మంగళవారం స్పోర్ట్స్ దుస్తులు, షూ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సాధారణంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు విద్యను అభ్యసిస్తుంటారని చెప్పారు. వారికి సరైన ప్రోత్సాహం లేక క్రీడలు తదితర రంగాల్లో రాణించలేకపోతున్నారన్నారు. వారికి ప్రోత్సాహముంటే భవిష్యత్తులో ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఏ రంగంలో ఆసక్తి ఉన్నా విద్యార్థులకు జీఆర్ ఫౌండేషన్ ద్వారా సాయం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు సహకరిస్తాం

జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్



సంధ్యకు పాఠశాలలో అడ్మిషన్ ఇప్పిస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

కడ్తాల్ (తలకొండపల్లి), జూన్ 25 : నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థుల చదువుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున సహకరిస్తామని తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని కొల్కులపల్లి గ్రామానికి చెందిన తోడేటి సంధ్య అనే విద్యార్థి తల్లి ఇటీవల మృతిచెందింది. తల్లి చనిపోవడంతో సంధ్య తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలోని తన అమ్మమ్మ వద్దే ఉంటున్నది. సంధ్య చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురావడంతో, సమస్యను స్థానికులు జడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వెంకటేశ్ మంగళవారం సంధ్యను ఆమనగల్లులోని ప్రజ్ఞ రెసిడెన్షియల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఎంతో మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, అలాంటి విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపారు. అలాగే జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మైసయ్య ఇంటి నిర్మాణానికి, ట్రస్ట్ తరపున సిమెంట్, స్టీల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, నాయకులు శ్రీశైలం, మోహన్‌రెడ్డి, మల్లేశ్, బుచ్చిబాబు, మధు, మహేశ్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి.. బాలుడికి గాయాలు

తుర్కయాంజాల్, జూన్ 25 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీ చెందిన పట్నం రమేశ్ కుమారుడు రిషి 4వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి మన్నెగూడ చౌరస్తా నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు బాలుడిపై దాడి చేసి తొడ భాగంలో గాయపరిచాయి. బాలుడి అరుపులు విన్న స్థానికులు కుక్కలను అక్కడి నుంచి తరిమేసి బాలుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. గత కొద్ది రోజులుగా కుక్కలు దాడులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు అధికారుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కలు లేకుండా చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న మణిగౌడ్

షాద్‌నగర్‌రూరల్, జూన్ 25 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని యువ నాయకుడు మణిగౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని పీర్లగూడెంలో విద్యార్థులకు మంగళవారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మానసిక ఉల్లాసంతోపాట ఏకగ్రత పెరుగుతుందని, స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ నైపుణ్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మెథడిస్ట్ రంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ రెవరెండ్ విజయారావు

పెద్దఅంబర్‌పేట : వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మొయినాబాద్, జూన్ 25 : పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మెథడిస్ట్ రంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ రెవరెండ్ విజయారావు అన్నారు. మండల కేంద్రంలోని మెథడిస్ట్ చర్చి వద్ద ఇండియా మెడికల్ మిషన్ యూఎస్ఏ, యూనీకార్పస్ హెల్త్ ఫౌండేషన్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 250 మంది సేవలను సద్వినియోగం చేసుకున్నారు. 90 మందికి రక్త పరీక్షలు చేయడంతోపాటు 75 మందికి కంటి పరీక్షలు చేసి అద్దాలు అందించారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది నాణ్యమైన వైద్య సేవలు పొందలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు యూనీకార్పస్ పాలీ క్లినిక్, సికింద్రాబాద్ వైఎంసీఏలోని మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్, పెద్ద అంబర్‌పేట, హయత్‌నగర్‌లోని యూనీకార్పస్ వరల్డ్ అండ్ డీడ్ హాస్పిటల్, రిహాబిలిటేషన్ సెంటర్‌లో సేవలను పొందేందుకు డిస్కౌంట్‌తో కూడిన ప్రత్యేక ప్రివిలైజ్ కార్డులు ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

450 మందికి ఉచిత వైద్య సేవలు

పెద్దఅంబర్‌పేట : యూనీకార్పస్ వరల్డ్ అండ్ డీడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 450 మందికిపైగా పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్నవారికి జనరల్ మెడికల్, ఆర్థోపెడిక్, గైనిక్, దంత, కంటి, ఫిజియోథెరపీ సేవలను అందించారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కండ్లద్దాలు అందజేశారు. రక్త పరీక్షలు, ఈసీజీ సేవలు, ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో సేవలు అందించిన ఇండియా మెడికల్ మిషన్స్, యూనీకార్పస్ హాస్పిటల్ సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.